వెంపడం పంచాయతీ విభజనకు ఏకగ్రీవ మద్దతు

విశాలాంధ్ర-పూసపాటి రేగ : పూసపాటి రేగ మండలంలోని వెంపడం పంచాయతీ నుంచి తాళ్లపేట పంచాయతీగా విభజన జరగాలనే ప్రధాన లక్ష్యంతో సాగుతున్న పోరాటం ఫలితంగా తాళ్లపేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. విభజన ప్రక్రియలో మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి నాయకుల నుంచి ఎన్నో ఆంక్షలు, ఇబ్బందులు ఎదురైనా తమ ఎజెండాను వెనక్కి తీసుకోకుండా గ్రామస్తులు ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో ఈ రోజు తాళ్లపేట గ్రామంలో రామునాయుడు అధ్యక్షతన మండల అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు మొత్తం 546 మంది గ్రామస్తులు హాజరయ్యారు. గ్రామ సభలో పాల్గొన్న వారందరూ ఏకగ్రీవంగా వెంపడం పంచాయతీ నుంచి తాళ్లపేట పంచాయతీగా విభజన జరగాలని తీర్మానం చేశారు. గ్రామస్తుల ఈ ఏకాభిప్రాయం విభజన ప్రక్రియకు కీలక మైలురాయిగా మారింది. ఇక చూడాలి మరి విభజన జరుగుతుందో లేదో...

క్రీడాపోటీలలో ఉత్సాహంగా పాల్గొనండి : ఎమ్మెల్యే మాదవి

నెల్లిమర్ల ప్రీమియర్ లీగ్ - నిర్వాహకులు జనసేన నేతలు కోట్ల రఘు, బాల అప్పలరాజు

విశాలాంధ్ర-భోగాపురం: పల్లె ప్రజలు ఆరోగ్యంగా ఆర్థికంగా ఆహ్లాదకరంగా ఉండాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రానున్న సంక్రాంతి పండగను ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసున్నామని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. జనసేన నాయకులు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం సర్పంచ్ బాల అప్పలరాజు కలసి యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో నెల్లిమర్ల ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. నెల్లిమర్ల ప్రీమియర్ లీగ్ లో క్రికెట్, వాలీబాల్ పోటీలు ఎస్ ఎం ఎస్ కంపెనీ ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహిస్తున్నారన్నారు. నియోజకవరంలో ఉన్న ఉన్నత పాఠశాలల విద్యార్థులు, జూనియర్ కళాశాలల విద్యార్దులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తానని తెలిపారు. ఈ పోటీలకు మొదటి బహుమతి ప్రథమ స్తానంనకు 30,000 రూపాయలు, ద్వితీయ స్థానానికి 20,000 అందించనున్నారు. అలాగే మహిళలకు గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. నియోజక వర్గ ప్రజలు ఈ క్రీడా పోటీలో ఉత్సాహంగా పాల్గొవాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తున్న జనసేన నేతలను అభినందించారు. నిర్వాహకుడు కోట్ల రఘు మాట్లాడుతూ ఆసక్తి ఉన్న క్రీడా కారులు మంగళవారం నుంచి తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 3 నుంచి 13 వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని, వేడుకల పేరుతో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకొనేందుకు జిల్లా ఎస్పీ ప్రజలకు కొన్ని సూచనలు తెలిపారు ఈనెల 31 రాత్రి రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.వాహనాలను అతివేగంగా నడిపినా, బైక్ రేసులు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగు చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు.డిసెంబరు 31న నూతన సంవత్సర వేడుకల పేరుతో అర్ధ రాత్రి ఒంటి గంట తరువాత ప్రజలెవ్వరూ రహదారుల పై తిరగరాదన్నారు. మైనర్లుకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వవద్దరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా డ్రైవ్ చేపడతామని, ఎవరైనా మైనరు డ్రైవింగు చేసి పట్టుబడితే, వారిపైనా, వారికి వాహనాలిచ్చిన తల్లిదండ్రులు లేదా ఆయా వాహనయజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్ళలో పోలీసు బందోబస్తు, పికెట్లను ఏర్పాటు చేస్తామన్నారు.బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, నృత్యాలు చేయడం, బహిరంగ పార్టీలు నిర్వహించడం, రంగులు పూయడం, డిజే/లౌడు స్పీకర్లుతో పెద్ద శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.వేడుకలలో పేరుతో మందుగుండు సామగ్రిని కాలిస్తే చర్యలు తప్పవన్నారు.బహిరంగ ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో గుమిగూడడం, వేడుకలు నిర్వహించడం, ప్రజాశాంతికి భంగం కలిగించినా చర్యలు తప్పవన్నారు.మహిళలు, యువతులను వేధించడం, ఈవ్ టీజింగుకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా మద్యం షాపులు, బార్లపైన కూడా చర్యలు తప్పవన్నారు.డిసెంబరు 31న రాత్రి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రి పెట్రోలింగు, డ్రోన్ పెట్రోలింగు, గస్తీని ముమ్మరం చేస్తామన్నారు.కావున, ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ఇంటి వద్దనే జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి డ్రంకన్ డ్రైవ్ కేసులలో ఇరుక్కొని జైలుకు వెళ్ళి కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు దూరం కావద్దని, పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు

విశాలాంధ్ర-దత్తిరాజేరు: డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని దత్తిరాజేరు మండలం అంగన్వాడి పెదమానాపురం కేకే వలస సెక్టార్ పరిధిలో సి ఐ టి యు లక్ష్మి ఆదేశాలు తో సెక్టార్ లీడర్ లు జ్యోతి, రాములమ్మ, పద్మకళ, నరసమ్మ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రం విడుదల చేసి జనవరి 4వ తేదీ జరుగు ర్యాలీ మరియు బహిరంగ సభకు అంగన్వాడి ఆశాలు, మధ్యాహ్నం భోజన కార్మికులు, స్కూల్ ఆయాలు, గ్రీన్ అంబాసిడర్ లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు కోటిమంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే కార్మిక నాయకులు దేశం నలుమూలల నుండి సుమారుగా 2000మంది ప్రతినిధులు హాజరవుతారని, 3 లక్షల మంది కార్మికులు ఉద్యోగులతో మహా ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని ఈ మహాసభలకు జిల్లాలో ఉన్న కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చి కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మారుస్తున్నది. ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే మొదలైనవి. నిత్యవసర వస్తువులు, పెట్రోలు ,డీజీలు, గ్యాస్ ధరలు పెంచుతున్నారు. విద్య ,వైద్యం,వ్యాపారం చేశారు. స్కీం వర్కర్లు కు కనీస వేతనాలు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు.

జాతీయ స్థాయి జూనియర్ ఖో ఖో పోటీలకు అక్క చెల్లి ఎంపిక

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో గరికవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సమానం లక్ష్మీ ప్రసన్న, 9వ తరగతి చదువుతున్న సమానం పూజిత జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు విజయనగరం జిల్లా నుంచి ఎంపికయ్యారని పిడి మల్లికార్జున్ సోమవారం తెలిపారు. ఈ పోటీలు ఈనెల30వ తేదీన, జనవరి 3వ తేదీన బెంగళూరులో జరుగనున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీదేవి, సర్పంచ్, బెల్లాన సన్యాసమ్మ , గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు

శ్రీరామ చంద్రమూర్తి ఆశీర్వాదం పొందండి

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

రామతీర్థంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

విశాలాంధ్ర-భోగాపురం: వైకుంఠ ఏకాదశి పుణ్య దినం సందర్భంగా నేడు రామతీర్థం ప్రముఖ ప్రాచీన రామచంద్ర మూర్తి దేవాలయం లో అన్ని ఏర్పాట్లు చేశామని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. విజయనగరం జిల్లా నుండే కాకుండా ఉత్తరాంధ్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని అన్నారు. శ్రీసీతా రామ చంద్రుని ఉత్తర ద్వార దర్శనం, గిరి ప్రదక్షణ, మెట్లోత్సవం మొదలైన ఉత్సవాలు అంగరంగ వైభావ్యంగా నిర్వస్తున్నామని పేర్కొన్నారు అలాగే 20 వేల మందికి అన్న ప్రసాదాలు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ రామ చంద్ర ప్రభువు ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు డీసీఎంఎస్ చైర్మన్ గొంప క్రిష్ణ భరోసా

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని అరిగిపాలేం గ్రామంలో గత వారం రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో పశుశాల పూర్తిగా దగ్ధమై తీవ్ర నష్టం వాటిల్లిన ముక్కా శ్రీను, ముక్కా పెద్ద అప్పారావు కుటుంబాలకు డీసీఎంఎస్ చైర్మన్ శ్రీ గొంప క్రిష్ణ మానవతా హృదయంతో అండగా నిలిచారు.అగ్నిప్రమాదం కారణంగా జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్, ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.5వేలు చొప్పున మొత్తం రూ.10వేలు నగదు సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుకోని ప్రమాదాల సమయంలో ప్రజలకు అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యతని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు,అరిగి సన్యాసిరావు,ముక్కా రామకృష్ణ, టిడిపి నాయకులు పరవాడ జగదీష్ గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, సేవాభావాన్ని ప్రశంసించారు. అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవడంలో ఆయన చూపిన మానవతా దృక్పథం గ్రామస్తుల మనసులను ఆకట్టుకుంది.

జిల్లా సమాఖ్య ద్వారా నర్సరీ మొక్కల విక్రయం : కలెక్టర్

కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రకాల అలంకరణ మొక్కలు, పూల మొక్కలు, ఇండోర్ మొక్కలు, ఫ్రూట్ ప్లాంట్స్ విక్రయానికి అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం పిజీఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ ను కలసిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి మాట్లాడుతూ, నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 31 నుండి జనవరి 15 వరకు తక్కువ ధరలకు నాణ్యమైన మొక్కలను విక్రయిస్తామని కలెక్టర్కు తెలిపారు. వివరాలకు 8008201398 నంబర్ లో సంప్రదించాలని ఆమె తెలిపారు. కార్యక్రమం లో డిఆర్డిఎ పీడీ శ్రీనివాస పాణి పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసీపీ నేతలు

ప్రజల సౌలభ్యం కోసమే ప్రతిపాదన చేసాం

మండల టీడీపీ నేతల వెల్లడి

విశాలాంధ్ర-జామి: మండలంలోని భీమసింగి పంచాయితీ పరిదిలోని తెలగాపాలెంను, శాసనాపల్లి పంచాయతీ పరిదిలోని సోమయాజులపాలెం గ్రామాలు పక్కపక్కనే ఉండడంతో రెండు పంచాయతీలతో కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని తాము ప్రతిపాదన చేసామని, దీనిని వైసీపీ నేతలు తప్పుడు వాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండల టీడీపీ నేతలు ఆరోపించారు. సోమవారం జామిలోని మండల పార్టీ అధ్యక్షులు వర్రిరమణ, పోలిపర్తి స్వామినాయుడుల ఆద్వర్యంలో పలువురు నేతలు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ కేవలం పంచాయతీలకు దూరంగా ఉండడంతో ప్రజల సౌలభ్యం కోసం తాము ఈప్రతిపాదన చేసామని, ఇది రాజకీయంగా వైసీపీ నేతలు తప్పుగా వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. తాము తెలగాపాలెం, సోమయాజులపాలెం గ్రామాలను కలపి పంచాయతీగా చేయాలని కోరామని, కానీ పక్కనే ఉన్న కంది శ్రీరాంపురం, పీతలపాలెం గ్రామాలను కూడా కలపాలని చెప్పినట్లుగా తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈవిసయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి దనియాల పైడిరాజు, జిల్లా పార్టీ అధికార ప్రతినిది కొమ్మినేని శ్రీను, కొత్తలి సూర్యారావు, సబ్బవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందేలా చూడాలంటూ వినతి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహకారంతో బాటు దివ్యాంగ క్రీడాకారులకు (పారా) ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందేలా చూడాలని పారా అంతర్జాతీయ క్రీడాకారుడు యాళ్ళ సత్తిబాబు జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర రెడ్డిని కలిసి కోరారు. ఈమేరకు సోమవారం నాడు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తో కలిసి కలెక్టరెట్ లో జరిగిన గ్రీవెన్స్ లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన పారా బాడ్మింటన్ క్రీడాకారుడు యాళ్ల సత్తిబాబు ఇప్పటివరకు జాతీయ స్థాయిలో అనేక మెడల్స్ సాధించి జిల్లాకు పేరు తీసుకుని వచ్చాడని, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచాడని కలెక్టర్ కు వివరించారు. భవిష్యత్‌లో జరుగబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహకారం తో బాటు దివ్యాంగ క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందేలా చూడాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని

దొరికిన బంగారు పుస్తెలతాడు నిజాయితీగా అప్పగింత

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని చిట్టాయివలస గ్రామానికి చెందిన సిరిపురపు సత్యనారాయణ కు ఈనెల 14వ తేదీన విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర 17 గ్రాముల బంగారు పుస్తెలతాడు దొరికింది. ఈ పుస్తెలతాడు ను నిజాయితీగా సోమ వారం 29వ తేదీన గజపతినగరం పోలీస్ స్టేషన్కు వచ్చి సీఐ జీఏవి రమణ, ఎస్సై కిరణ్ కుమార్ నాయుదుల సమక్షంలో అప్పగించారు. ఈ తాడును విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కి తెలియపరచి పోలీసులు అప్పగించారు.

డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు

కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినా, కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపుచేసినా సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఉదయం వ్యవసాయ అధికారులు తో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం విత్తిన, భవిష్యత్ లో విత్తనున్న పంటలకు సంబంధించి ఎరువులు అవసరమైన గ్రామాలు, మండలాలను గుర్తించి ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చెరువులు మరియు ఇతర వనరుల ద్వారా నీటి వసతి బాగా ఉండటంతో, గత సంవత్సరం కంటే ఈసారి మొక్కజొన్న మరియు కూరగాయల సాగు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వచ్చే 15 రోజులకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని మండలాల వారీ పంటల సాగు విస్తీరా?న్ని బట్టి ముందుగానే అంచనా వేసి, రాష్ట్ర స్థాయికి ఎప్పటి కప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఎరువుల డీలర్ వద్ద యూరియా నిల్వల వివరాలు తెలియజేసే స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు యూరియా కొనుగోలు చేసే సమయంలో బస్తాపై ముద్రించిన ఎం.ఆర్.పీ ధరలను పరిశీలించి, అదే ప్రకారం ధర చెల్లించి, తప్పనిసరిగా డీలర్ నుండి రసీదు పొందేవిధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీలర్లు ఇతర ఉత్పత్తులతో కలిపి విక్రయించినా, ఎం.ఆర్.పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, వారి లైసెన్సులు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం, 1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాధికారి విటి రామారావు, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సభ్యుల నిర్లక్ష్యంతో నీరుగారిన రేగిడి ఆమదాలవలస సర్వసభ్య సమావేశం

గ్రామ సమస్యలపై చర్చలేమి ?

తూతూ మంత్రంగా ముగిసిన సమావేశం

విశాలాంధ్ర-రేగిడి: రేగిడి ఆమదాలవలస మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ దారా అప్పల నరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో శ్యామల కుమారి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. మండలంలోని గ్రామ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు నిర?యించాల్సిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర సభ్యులు ఆశించిన స్థాయిలో హాజరు కాకపోవడం విమర్శలకు దారి తీసింది. ప్రజల తరపున మాట్లాడాల్సిన ప్రతినిధులే సమావేశానికి దూరంగా ఉండటంతో అనేక సమస్యలు చర్చకు రాకుండా పోయాయి.హాజరైన కొద్దిమంది సభ్యులు కూడా అధికారులను గట్టిగా ప్రశ్నించకపోవడంతో సమావేశం తూతూ మంత్రంగా సాగిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. గత సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, వాటిపై సమీక్ష జరగకపోవడం పట్ల సభ్యులు అసంత ృప్తి వ్యక్తం చేశారు.సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వ్యవసాయ సమస్యలపై మాట్లాడుతూ. రబీ సీజన్‌లో మొక్కజొన్న, రాగి పంటలు సాగు చేస్తున్న అర్హులైన రైతులకు యూరియా సక్రమంగా అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కోరవలస గ్రామ రైతులకు యూరియా అందలేదని ఆ గ్రామ సర్పంచ్ ప్రశ్నించగా, ఇలాంటి పరిస్థితులు మరల పునరావ ృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఆదేశించారు. అలాగే ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో పర్యటించే సమయంలో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని స్పష్టం చేశారు.రెవెన్యూ వ్యవస్థలో మ్యూటేషన్, వివాదాస్పద భూముల సమస్యలు పెరుగుతున్నాయని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని, అలాగే తునివాడ గ్రామంలో డ్వాక్రా సంఘాలకు గతంలో జరిగిన అవకతవకలు మరల పునరావ ృతం కాకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సంబంధించిన నిధుల్లో పారదర్శకత తప్పనిసరిగా ఉండాలని అన్నారు.ఇదే సమావేశం చివర్లో వైస్ ఎంపీపీ టంకాల అచ్చం నాయుడు 15వ ఫైనాన్స్ నిధుల వివరాలను సభా సమావేశంలోనే వెల్లడించాలని ఎంపీడీవో శ్యామల కుమారిని కోరారు. అయితే ఆమె 15వ ఫైనాన్స్ వివరాలను సభలో పూర్తిగా వెల్లడించకుండా, కేవలం ఆయన వరకే చెప్పడంపై ఈ వ్యవహారం అనేక ప్రశ్నలకు దారితీస్తూ, నిధుల వినియోగంపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

డీఎస్పీ రాఘవులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : మత్తు పదార్థాలకు బానిసలై నేటి యువత వారి భవిష్యత్తులను చిత్తు చేసుకోకూడదని చీపురుపల్లి డిఎస్పి ఎస్ రాఘవులు కోరారు. సోమవారం నాడు చీపురుపల్లి ఆదిత్య జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సునకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు వంటి వాటికి యువత దూరంగా ఉండాలని చదువు పైన ఏకాగ్రతను పెంచుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కళాశాల విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన పెంచుకోవాలన్నారు. నేరాలకు పాల్పడితే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రహదారి భద్రత, సైబర్ క్రైమ్ వంటి నేరాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ప్రత్యేకించి బెట్టింగ్ యాప్ల ద్వారా యువత చెడు మార్గం వైపు ప్రయాణం చేయకూడదన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమపై పెట్టుకున్న ఆశలను విద్యార్థులు నెరవేర్చవలసిన బాధ్యత ఉందన్నారు. గంజాయి వంటి మారకద్రవ్యాలు వాడిన, అమ్మ చూపిన, నిల్వ ఉంచిన ప్రతి ఒక్కరూ నేరస్తులు అవుతారని ఈ సందర్భంగా హెచ్చరించారు. చట్ట పరిధిలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు..ఈ కార్యక్రమం లో సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శంకరావు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎల్. దామోదరావు, మానవీయత స్వచ్ఛంద సంస్థ గోవింద రాజులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ విద్యా సంస్థలు ఫౌండేషన్ నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం కు విశేష స్పందన

అధ్యక్షురాలు డా.చింత శారద

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం లో అభ్యుదయ విద్యా సంస్థలు మరియు అభ్యుదయ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ చింతా శారద, మర్రపు కూర్మినాయుడు (నాని)లు అనేక సామాజిక సేవ కార్యక్రమంలో ముందంజలో ఉంటున్నారు. యువతీ యువకుల జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి, మత్తు పదార్థాలు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు ఏర్పాటు అవగాహన కల్పించడం, ఇటీవల నియోజకవర్గ పరిధిలోని తెర్లం మండలం లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది బాధితులకు అండగా అభ్యుదయ విద్యాసంస్థలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితులకు చేయూత భరోసా గా నిత్యవసర వస్తువులు, వస్త్రాలు పంపిణీ చేసి ప్రజల మన్ననలు పొందారు . అందులో భాగంగా సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం లో 144 మంది విద్యార్థులు పాల్గొని పెద్ద ఎత్తున రక్తదానం చేశారు.ఈ సందర్భంగా అభ్యుదయ విద్యాసంస్థలు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చింతా శారద మర్రపు కూర్మినాయుడు (నాని) లు విలేకరులతో మాట్లాడారు. రక్తదానం అనేది స్వఛ్ఛందమైన సేవ ప్రక్రియ అని అభ్యుదయ విద్యా సంస్థలు మరియు అభ్యుదయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా.చింత శారద అన్నారు.సోమవారం బొబ్బిలిలోని గౌడ వీధిలో గల అభ్యుదయ పాఠశాలలో యన్ వి యన్ బ్లడ్ బ్యాంక్ మరియు బొబ్బిలి బ్లడ్ సెంటర్ సహకారంతో స్వఛ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని అభ్యుదయ విద్యా సంస్థలు కరెస్పాండెంట్ యం. కె.నాయుడు (నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.చింత శారద మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం కి ముందుకు రావాలని ,యువత రక్తదానం పై అవగాహన పెంచుకోవాలని అన్నారు.ఈ శిబిరంలో 144 మంది రక్తదానం చేశారు. రాజా కాలేజ్ కరస్పాండెంట్ సుజయ్ నాయన కి,విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్ ఎస్ కాలేజీ విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు సాయి కుమార్,యన్ వి యన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు,బొబ్బిలి బ్లడ్ సెంటర్ ఈశ్వరరావు,సభ్యులు పాల్గొన్నారు..రక్తదానం చేసిన వారిని ప్రాణదాతలుగా నిలిచినందుకు అభినందించారు.

కప్పేసిన మంచు దుప్పటి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండల కేంద్రం, రంగరాయపురం, గోల్డ్ స్టార్ కూడలి, సోంపురం కూడలి, మధ్య విశాఖ-అరకు ప్రధాన రహదారి మధ్యలో సోమవారం సుమారు వేకు వ జాము నుంచి ఉదయం సుమారు 8:30 గంటల మధ్యకాలంలో మంచు అధికముగా కు రవ డం తో మంచు దుప్పటి కప్పేసినట్లు ద్విచక్ర, ఆటోలు, బస్సులు, అతి భారీ వాహనాలు రాకపోకలకు రహదారి కనిపించకపోవడంతో వాహనదారులు ఎక్కడ ఏ రకమైన ప్రమాదం సంభవిస్తుందోనని బితుకు బితుకుమంటూ ప్రయాణాలు కొనసాగించారు. ఈ ఏడాది కొనసాగుతున్న శీతాకాల సమయంలో ఇప్పటివరకు ఏ రోజు ఎంత భారీ ఎత్తున మంచు కు ర వ లేదని పలువురు ప్రయాణికులు, మండల కేంద్రం, రంగరాయపురం తదితర గ్రామాల ప్రజలు అనుకున్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే లోకం మాధవి

విశాలాంధ్ర-భోగాపురం : నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన విశాలాంధ్ర రిపోర్టర్లు తయారు చేయించిన విశాలాంధ్ర-2026 మల్టీ కలర్ క్యాలెండర్‌ను సోమవారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. భోగాపురం మండలంలోని మిరాకిల్ సిటీలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. క్యాలెండర్‌ను చూసిప ఎమ్మెల్యేతోపాటు పలువురు జనసేన నేతలు ఆనందం వ్యక్తం చేసి విశాలాంధ్ర టీంను అభినందించారు. ఈకార్యక్రమంలో పలువురు నియోజకవర్గ జనసేన నేతలతోపాటు విశాలాంధ్ర విజయనగరం జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ ఎన్.సన్యాసిరావు, రిపోర్టర్లు కె.రామకృష్ణ, పి. గోవింద్, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

చిన్న ఆంజనేయ స్వామికి నూతన కవచధారణ మహొత్సవం

మహిళలచే ప్రేత్యేక దీపారాధన

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : పట్టణంలో దాసన్నపేటలో అతి పురాతనమైన శ్రీశ్రీ చిన్న ఆంజనేయ స్వామి వారికీ దాతలు సహకారం తో ఏర్పాటు చేసిన నూతన కవచం ధారణ మహొత్సవం ఘనంగా ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ అరవెల్లి రామాచార్యులు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం 108 మంది మహిళలచే దీపారాధన నిర్వహించారు. అనంతరం అందరికి వేద ఆశీర్వాదం ఇచ్చి స్వామి వారి డాలర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సూర్యనారాయణ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

సిఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

ఎస్.కోట నియోజకవర్గంలో ఆటో ప్రచారం

జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా జగన్ పిలుపు

విశాలాంధ్ర - వేపాడ:గజపతినగరం:విశాఖపట్నంలో జరగనున్న సిఐటీయూ 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటీయూ విజయనగరం జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని వేపాడ, లక్కవరపుకోట,కొత్తవలస, శృంగవరపుకోట మండలాల్లో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూదేశంలో కార్మిక వర్గం,స్వతంత్రానంతరం ఎన్నడూ ఎదుర్కోని పరిస్థితులను నేడు ఎదుర్కొంటోందన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు.ధరలు ఆకాశాన్ని అంటుతుంటే జీతాలు మాత్రం పాతాళంలోకి వెళ్లిపోయాయని విమర్శించారు. మరోవైపు ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ల సంపదలు అమాంతంగాపెరుగుతున్నాయని తెలిపారు. లేబర్ కోడ్‌ల పేరుతో బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు సాధించుకున్న హక్కులను రద్దు చేస్తున్నారని,సంఘాలు పెట్టనివ్వకుండా,సమ్మెలకు అడ్డుకట్ట వేస్తున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో పాటు ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మకానికి పెట్టడం లేదా మూసివేయడం ద్వారా కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో విశాఖలో జరగనున్న అఖిలభారత సిఐటీయూ మహాసభలు అందుకే జనవరి 4న విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే బహిరంగ సభకు కార్మికులు,కష్టజీవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చేలికాని ముత్యాలు,ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయి, సోంపురం గ్రామాలలో రీసర్వేపై గ్రామసభ

రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ఉప తహసిల్దార్ రామకృష్ణ

విశాలాంధ్ర - వేపాడ: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు మండల ఉప తహసిల్దార్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని సోంపురం, సింగరాయి గ్రామంలలో సోమవారం ఆయా గ్రామాలలో భూముల రీసర్వే ప్రక్రియపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ, జనవరి 2వ తేదీ నుండి గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుందని తెలిపారు. సర్వే జరుగుతున్న సమయంలో భూములు కలిగిన రైతులందరూ తమ తమ భూముల వద్ద పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు తదితర సంబంధిత ఆధార పత్రాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలనిసూచించారు. సర్వే పూర్తయ్యాక ప్రతి రైతుభూమిని ఎల్పీ నెంబర్లతో పాటు ఆన్లైన్‌లో నమోదు చేసి, రైతు పేరుతో భూమిని డిజిటల్ రికార్డులలో పొందుపరుస్తామని తెలిపారు. ఈ రీసర్వే ద్వారా భూ విభేదాలు, కొలతల లోపాలు, పేర్ల మార్పులు వంటి సమస్యలు పరిష్కారమై రైతులకు స్పష్టమైన హక్కులు లభిస్తాయనిపేర్కొన్నారు. కావున గ్రామంలోని భూములు ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు,ఆయా గ్రామాల రైతులతో పాటు,వీఆర్‌ఓలు సచివాలయ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా... కళాశాల విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సభ

విశాలాంధ్ర - వేపాడ:మండల కేంద్రం వేపాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సభ ఉల్లాసం, ఉత్సాహంతో కన్నుల పండుగగా సాగింది. మొదటి సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు అభిమానంతో, ఆప్యాయతతో తమ సీనియర్లకు ఈ వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరీక్షలకు ఉపయోగపడే ప్లాంక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు వంటి అవసరమైన సామగ్రిని మొదటి సంవత్సరం విద్యార్థులు రెండవ సంవత్సరం విద్యార్థులకు అందజేసి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావుని విద్యార్థులు దుస్సాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని శతశాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ సిబ్బందికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సభను మరింత ఉత్సాహభరితంగా మార్చి చూపరులను ఎంతగానో అలరించాయి. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం విద్యార్థుల మధుర జ్ఞాపకాలుగా నిలిచింది.

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ 2026 వార్షిక, పాకెట్ క్యాలెండర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్:విజయనగరం టెలిఫోన్ భవన్‌లోని స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్యాలెండర్‌తో పాటు 2026 పాకెట్ క్యాలెండర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ క్యాలెండర్లను విజయనగరం జిల్లా బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దూసూరి దాలీ నాదు , ఏజీఎం శారద, శ్రీధర్ , మురళీధర్ , శ్రీనివాస్ మరియు దాస్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అలుగు వెంకట్రావు, లక్షణ కుమార్, అక్కమ్మ, భాగ్యలక్ష్మి మరియు రేవల్ల రమణమ్మ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగుల ఐక్యత, సేవాభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

సచివాలయసిబ్బంది విధులకు సమయపాలన పాటించాలి

ఎంపీడీఓ సిహెచ్. సూర్యనారాయణ

విశాలాంధ్ర -వేపాడ:విధుల నిర్వహణలో సచివాల సిబ్బంది సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ అన్నారు .మండల పరిధిలోని వేపాడ, వల్లంపూడి గ్రామ సచివాలయాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో నిర్వహణ, రికార్డుల నిర్వహణ తీరునుపరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలనీ, అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలనీ సూచించారు. అలాగే మండలంలో చేపట్టిన సర్వే పనులన్నీ సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, ప్రతి జాబు కార్డు దారుడికి 100 పని దినాలు పూర్తి చేయాలని తెలిపారు. జాబు కార్డ్ హెూల్డర్లు అందరూ పనులకు హాజరై, రోజుకు రూ.307లు చొప్పున ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనవరి 2 నుండి 4వ విడత రిసర్వే ప్రారంభం

విశాలాంధ్ర -గుర్ల: మండలంలో 4వ విడత రీ సర్వే జనవరి 2 నుంచి ప్రారంభిస్తామని మండల సర్వేయర్ శివ సోమవారం తెలిపారు. మండలంలో 6 గ్రామాల్లో తాతావారికితలి, పెనుబర్తి, పెద్దబంటుపల్లి, గూడెం, కొండగంద్రేడు, నడుపూరు గ్రామాల్లో రీసర్వే చేపడతామన్నారు. సోమవారం మూడు గ్రామాల్లో గ్రామసభలు, ర్యాలీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకణాల శ్రీను, గ్రామ సర్వేలు, రైతులు పాల్గొన్నారు

నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ స్థలానికి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావును కలిసిన ప్రతినిధులు

విశాలాంధ్ర- విజయనగరం ఫోర్ట్: నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలం విషయమై చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావుని నాయి బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంద్రేటి సత్యనారాయణ మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వంలో నాయి బ్రాహ్మణులకు తగిన న్యాయం జరిగిందని అన్నారు. నాయి బ్రాహ్మణులకు లబ్ది చేకూర్చే అనేక సంక్షేమ పథకాలు తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్యంగా గతంలో 150 యూనిట్లుగా ఉన్న ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచి అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇది పేద, వెనుకబడిన వర్గాలకు ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి నారా లోకేష్కి జిల్లా నాయి బ్రాహ్మణుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని గంద్రేటి సత్యనారాయణ తెలిపారు. నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ స్థలం విషయంలో కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి విద్యార్థి క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరాలి : భీశెట్టి

ఘనంగా జిల్లా స్థాయి కోకో పోటీలు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్:విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో పాల్గొని ఉన్నత స్థాయి కి చేరుకోవడానికి కృషి చెయ్యాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. సోమవారం పట్టణంలో ని నేషనల్ స్కూల్లో జరుగుతున్న జిల్లా స్థాయి ప్రైవేటు స్కూళ్ల విద్యార్థుల కోకో పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి, విద్యార్థుల మనో నిబ్బరానికి దోహదం చేస్తాయని ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఉత్సాహం చూపాలని కోరారు,విజయనగరం జిల్లాలో గొప్ప క్రీడాకారులు ఉన్నారని 2024 లో శనపతి గురునాయుడు,2025 లో రెడ్డి భవానీ లు భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ లో బంగారు పతకాలు సాధించి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి,విజయనగరం జిల్లాకు, దేశానికి గొప్ప కీర్తిని తీసుకు వచ్చారని వీరు ఇద్దరూ అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించారని అన్నారు, నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్.వి.ఎన్. వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలోని దాదాపు 13 స్కూళ్ల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని ఒక్క రోజులో పోటీలు ముగిస్తామని, విద్యార్థులను ప్రోత్సహించాలని తొలిసారి ప్రయోగాత్మకంగా ఈ కోకో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు,తల్లిదండ్రులు కూడా పోటీల పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు,ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొడ్డు రామారావు,బొడ్డు రాజారావు,ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

జనసైనికులే జనసేన నాయకులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ శంకర్

విజయనగరంలో భారీ బహిరంగ సభలో

పార్టీలోకి జమ్ము శ్రీను, శశి భార్గవికి ఆహ్వానం

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ :జనసేన పార్టీలో జన సైనికులే నాయకులని, తమ పార్టీలో నాయకులు, కార్యకర్తలు అనే వ్యత్యాసం ఉండదని, అది తమ పార్టీ సిద్ధాంతం అని, తామంతా ఒక కుటుంబం అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏం ఎస్ ఎం ఈ రాష్ట్ర చైర్మన్ శివ శంకర్ ఉదాటించారు. విజయనగరంలోని మెసానిక్ టెంపుల్ లో నియోజకవర్గ జనసేన ఇంచార్జ్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వినీ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జన సైనికులనుద్దేశించి మాట్లాడారు. జనసేన పార్టీ ఇతర రాజకీయ పార్టీల తరహా పార్టీ కాదని, తమ పార్టీకి సంస్థాగత నిర్మాణం లేదని ప్రతి పక్ష పార్టీలు విమర్శలు చేసినా వాటిని పట్టించుకోవలసిన అవసరం తమకు లేదని ఎద్దేవా చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతం, ఆశయాలు ఏమిటో పూర్తిగా తెలియక, ఈ పార్టీలోకి కొత్తగా చేరిన వారు కొంత సంఘర్షణకి గురవుతూ ఉంటారని అన్నారు. అయితే జనసేన పార్టీ అంతర్గత సంస్కృతి, పవన్ కళ్యాణ్ ఆశయం, పార్టీ సిద్ధాంతం ఏమిటనేది అర్థమైతే మిగిలినవన్నీ అర్థమైపోతాయాన్నారు. ఇది అర్థంకాని వారు చాలా మానసిక సంఘర్షణకి గురవుతూ ఉంటారు. యువత, బడుగు బలహీన వర్గాల వారు నాయకత్వంలోకి రావాలన్న లక్ష్యంతో పవన్ కల్యాణ్ పార్టీ పెట్టారన్న వాస్తవాన్ని అంతా గమనించే ఉంటారని అన్నారు. ఈరోజు అనేక మంది యువకులు, బడుగులు రాజకీయాల్లోకి నాయకులుగా వస్తున్నారంటే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ పెట్టడం వల్లే సాధ్యమైందన్నారు. పరిష్కారం కానీ ఏ సమస్య ఉన్నా అది పవన్ కళ్యాణ్ ద ృష్టికి వెళ్తే పరిష్కారం అవుతుందన్న విశ్వాసం ఈరోజు ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఈ విషయం నేడు రాష్ట్రమంతా, దేశమంతా అర్థమౌతుందంటే అది పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి, అంకిత భావం, సామాజిక ద ృక్పథంకి అద్దం పడుతున్నాయని జనసైనికులు అర్థం చేసుకోవాలన్నారు. నియోజక వర్గ ఇంచార్జి పాలవలస యశస్విని మాట్లాడుతూ సుదీర్ఠ రాజకీయ అనుభవం కలిగిన నడిపేన శ్రీనివాస్ రావు (జమ్ము శ్రీను), ఆయన కుమార్తె శశి భార్గవి జనసేన పార్టీలో చేరడం శుభదాయకమని, వారి చేరికతో జనసేనకు ముందే కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగ వేడుకలు వచ్చేసినట్టు అయిందన్నారు. పార్టీలోకి వారి చేరికతో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నడిపేన శ్రీనివాస్ రావు (జమ్ము శ్రీను), ఆయన కుమార్తె మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శశి భార్గవి తో పాటు పార్టీలోకి కొత్తగా చేరిన బొండపల్లి మండలం ఓంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోగాపురపు కన్నం నాయుడు, దత్తిరాజేరు మండలానికి చెందిన మాజీ పోలీసు అధికారి యు ఉమా మహేశ్వర్ రావు, దేవుపల్లికి చెందిన పుప్పాల సుశీల తదితరులకి జన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ పార్టీ కండువాలు వేసి సాదరంగా వారిని జనసేనలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పిఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ, బొబ్బిలి, పార్వతీపురం, చీపురుపల్లి పీఓసీ సభ్యులు గిరడ అప్పలస్వామి, ఆదాడ మోహన్ రావు, విజినిగిరి శ్రీనివాస్ రావు తదితరులు జన

4.న హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-చీపురుపల్లి :జనవరి 4న చీపురుపల్లి లో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి నిర్వాహకులు పివి రామయ్య, పి అప్పలనాయుడు, డి అశోక్ కుమార్, కె అచ్యుత రావు లు సోమవారం నాడు కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. చీపురుపల్లి లోని అయోధ్య మైదానం, పాత మామిడికాయ శాల ప్రాంతంలో సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. కులాలు ప్రాంతాలు వృత్తులు పార్టీలు అతీతంగా హిందువులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఈ సందర్భంగా వారు కోరారు..

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష



విశాలాంధ్ర -గజపతినగరం: కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పుటకు గాను 31వ తేదీన రాత్రి మద్యం తాగి వాహనాలను నడిపితే గజపతి నగరం పోలీసులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో దొరికినట్లయితే వారం రోజులు జైలు శిక్ష విధించడం జరుగుతుందని గజపతి నగరం ఎస్సై కె. కిరణ్ కుమార్ నాయుడు పత్రికా ముఖంగా తెలిపారు.

రైతులు రీ సర్వేను వినియోగించుకోవాలి

డిప్యూటీ రీ సర్వే తాసిల్దార్ హేమంత్ కుమార్

విశాలాంధ్ర - మెంటాడ:మెంటాడ మండలం జీటి పేట, గుర్ల ఆగూరు, మెంటాడ గ్రామాలలో నిర్వహిస్తున్న నాలుగో విడత రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ రీ సర్వే తాసిల్దార్ హేమంత్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో రైతులు తమ భూమి వివరాలు సరిచూసుకొని అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ చొక్కాకు సన్యాసి, శరకాన రాము నాయుడు, చొక్కాకు సత్యం, ముగడ లింగేశ్వరరావు, రెడ్డి రాజగోపాల్, మండల సర్వేయర్ జ్యోతి, సచివాలయం సర్వేయర్లు, వి.ఆర్.ఓ చిన్నారావు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు విశేష స్పందన

పిర్యాదుదారుల నుండి మొత్తం 232 వినతులు స్వీకరణ

పి.జి.ఆర్.ఎస్. వినతులను వారంతంలోగా పరిష్కరించాలి

వినతులు పరిష్కారంలో ఆలసత్యం వహిస్తే సహించేది లేదు

రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలి

కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ :సోమవారం కలక్టరేటు ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు, రెవెన్యు క్లినిక్ కార్యక్రమంలకు విశేష స్పందన లభించింది. పిర్యాదుదారుల నుండి మొత్తం 232 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు ప్రజల నుండి వచ్చిన వినతులను వారంతంలోగా పరిష్కారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) మరియు రెవెన్యు క్లినిక్ కార్యక్రమం వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలక్టరు, జిల్లా రెవెన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలక్టర్లు తదితరులు ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను సాదవధానంగా విని, సంబంధింత శాఖాల అధికారులకు వెను వెంటనే ఆదేశాలు జారీ చేసారు. ప్రజల యొక్క వినతులు పరిష్కారంలో అధికారులు ఆలసత్యం వహిస్తే సహించేది లేదన్నారు. రెవెన్యూ శాఖకు వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి వారం పిజిఆర్ఎస్ పై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారుల నుండి మొత్తం 232 వినతులు స్వీకరించి, వినతులపై తగు పరిష్కారం, చర్యలు చేపట్టుటకు సంబంధింత శాఖల జిల్లా అధికారులను జిల్లా కలక్టరు ఆదేశాలు జారీచేసారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్ లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్ కు అందిన కాల్స్ కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. అర్జిదారుల సమస్యల పరిష్కారంపై సంబంధింత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానిని తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యు క్లినిక్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదికారి మురళి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి, సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, సి.పి.ఒ. బాలజి, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి మణిక్యంయుడు, వ్యవసాయ శాఖ జెడి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అన్నపూర్ణమ్మ, బి.సి.సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, పంచాయితీరాజ్ ఎస్.ఇ. ఆర్.డబ్ల్యుఎస్ మరియు ఆర్ అండ్ బి ఎస్.ఇ.లు మార్కఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు, విజయనగరం, ఐ.సిడి.ఎస్. పి.డి. విమలరాణి, డిఆర్ డి ఎ పిడి శ్రీనివాస్ పాణి, జిల్లా సమాచార పౌరసంబంధాల అదికారి పి.గోవిందరాజులు, మైక్రోఇరిగేషన్ పి.డి. లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు, విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి ఆర్.డి.ఓలు, జిల్లాలో అన్ని మండలాల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రతతోనే నూతన సంవత్సర వేడుకలు ఎస్సై పి. నారాయణరావు

నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలి: ఆంద్ర ఎస్సై కె. సీతారాం

విశాలాంధ్ర- మెంటాడ:నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ శాంతియుతంగా, హుందాగా నిర్వహించుకోవాలని ఎస్సై సీతారాం తెలిపారు.వేడుకల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ప్రజలకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.డిసెంబర్ 31వ తేదీ రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, నృత్యాలు చేయడం, బహిరంగ పార్టీలు నిర్వహించడం, రంగులు పూయడం, డీజే లేదా లౌడ్ స్పీకర్లతో అధిక శబ్దం చేస్తూ ప్రజలకు మహిళలు, యువతులను వేధించడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిసెంబర్ 31 రాత్రి పెట్రోలింగ్, గస్తీని ముమ్మరం చేస్తామని తెలిపారు.కావున ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ఇంటివద్దనే శాంతియుతంగా జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో ఇరుక్కొని జైలుకు వెళ్లి కుటుంబంతో వేడుకలకు దూరం కాకూడదని సీతారాం తెలిపారు.

భద్రతే లక్ష్యం నూతన సంవత్సరం వేడుకలపై రేగిడి పోలీసుల హెచ్చరిక

విశాలాంధ్ర -రేగిడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రేగిడి ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వి. బాలకృష్ణతెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహిస్తామని, పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేకుండా రాత్రి పార్టీలు, డీజే కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు నిర్వహించరాదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించడం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం నిషేధమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీస్ తనిఖీలకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం ఇవ్వాలని కోరుతూ, నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలనిరేగిడి ఎస్ఐ వి. బాలకృష్ణతెలిపారు

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

యం.పి.డి.ఓ పప్పు సుదర్శన్

విశాలాంధ్ర- మెంటాడ:సచివాలయ ఉద్యోగులు విధుల్లో కచ్చితమైన సమయపాలన పాటించాలని యం.పి.డి.ఓ పప్పు సుదర్శన్ సూచించారు. ఈసందర్భంగా సోమవారం మెంటాడ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యం.పి.డి.ఓ పప్పు సుదర్శన్ మాట్లాడుతూ, ప్రజలకు అందించే సేవల్లో ఆలస్యం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే సిబ్బంది సమయపాలన అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ యం.పి.డి.ఓ విమల కుమారి, సచివాలయం డిప్యూటీ యం.పి.డి.ఓ యం. సోమేశ్వరావు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు అందరూ సమావేశానికి హాజరయ్యారు.

భద్రతతోనే నూతన సంవత్సర వేడుకలు

ఎస్సై పి. నారాయణరావు

విశాలాంధ్ర-గుర్ల: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రజలంతా భద్రత కోసం కఠిన చర్యలు చేపడతామని ఎస్సై పి. నారాయణరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు విధించబడతాయి. అనుమతి లేకుండా రాత్రి పార్టీలు, డీజే కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు నిషేధం. ట్రాఫిక్ ఆటంకం కలిగించే గుంపులు, వేగంగా లేదా ప్రమాదకరంగా వాహనాలు నడపడం నేరం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసు వారు చూసిన చేశారు

విశాలాంధ్ర విజయనగరం
పేజి : 3
మంగళవారం, 30 డిసెంబర్ 2025

32 పశువులకు వైద్య చికిత్సలు

పశు వైద్యాధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య, గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని పశువైద్యాధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 32 పశువులకు చికిత్సలు అందించారు. ఇందులో 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక చికిత్సలు చేయగా, మరో 12పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్సలు చేశారు. అలాగే పెయ్యలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, పశువుల్లో పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించినప్పుడే పాడి పరిశ్రమ లాభదాయకంగా మారుతుందని సూచించారు.పశువు ఈనిన అనంతరం మూడు నెలల లోపు కట్టించినట్లయితే ఏటా ఒక ఈత పొందవచ్చని వివరించారు. పశువులు ఇచ్చే మేతలో ఖనిజ లవణ మిశ్రమాన్ని తప్పనిసరిగా చేర్చడం ద్వారా సరైన నిష్పత్తిలో పోషకాలు అందుతాయని తెలిపారు.ఆడ పెయ్యలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు పట్టడం వల్ల అవి వేగంగా ఎదిగి, తక్కువ వయస్సులోనే కట్టుకు వచ్చే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. అలాగే పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పుట్టిన వెంటనే దూడలకు జున్ను పాలను పట్టడం వల్ల కలిగే లాభాలు,వర్షాకాలంలో పశువులు మరియు జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పశుగ్రాస పెంపకం ద్వారా కలిగే,ప్రయోజనాలపై రైతులకు వివరించారు.ఈ శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొని రైతులకు సేవలు అందించారు.

పెన్షనుదారులు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలి

2026 జనవరి 1 తేది నుండి ఫిబ్రవరి 28 తేదిలోగా సమర్పించాలి

- ట్రెజరీ శాఖ సూచనలు జారీ

- జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనుదారులు మరియు కుటుంబ పింఛనుదారులు తమ లైఫ్ సర్టిఫికేట్ (జీవన ధృవీకరణ) ను 2026 సంవత్సరానికి తప్పనిసరిగా 2026 జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 లోపు మాత్రమే సమర్పించవలసినదిగా ట్రెజరీలు &ఎ% అకౌంట్స్ శాఖ సంచాలకులు సూచనలు జారీ చేసారని జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2025 మరియు డిసెంబర్ 2025 లో సమర్పించిన లైఫ్ సర్టిఫికెట్లు 2026 సంవత్సరానికి చెల్లవని ఆయన తెలిపారు. కాబట్టి 2025 లో ముందే లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చినవారు కూడా తప్పనిసరిగా 01-01-2026 నుండి 28-02-2026 మధ్యలో మళ్లీ సమర్పించాలని ఆయన తెలిపారు. పెన్షన్ విడుదలలో ఇబ్బందులు తలెత్తకుండా సూచించిన తేదీల్లో లైఫ్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా సమర్పించవలెనని పెన్షనుదారులకు విజ్ఞప్తి చేసారు. పెన్షనుదారుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపఖజానా కార్యాలయాలు, జిల్లా ఖజానా కార్యాలయాలు, అలాగే జీవన ప్రమాణ్ పోర్టల్ / App (Jeevan Pramaan) ద్వారా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించుకునే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు అవసరమగు పత్రాలు పీపీఓ నెంబర్ ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా సంఖ్య, మొబైల్ నంబర్ (ఓటీపీ కోసం తప్పనిసరి) లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ కోసం కార్యాలయాలకు వెళ్లే పెన్షనుదారులు తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్ సూచించారు.

స్వర్గీయ సత్యవతమ్మ ఆత్మకు శాంతి కలగాలి

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బాడంగి: స్వర్గీయ సత్యవతమ్మ ఆత్మకు శాంతి కలగాలని కోరుకు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే బేబీ నాయన నివాళు లర్పించారు. .బుడా చైర్మన్ , మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ము నాయుడు మాతృమూర్తి, తెంటు సత్యవతమ్మ పెదకర్మ సోమవారం ముగడ గ్రామంలో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్రకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు శాసనసభ్యులు ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన లక్ష్మునాయుడు గారు ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతిఒక్కరిని పలుకరించారు ఆప్యాయంగా. మాజీమంత్రి, ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు, ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీమతి కోళ్ల లలితకుమారి , మాజీ ఎమ్మెల్యే బంజిదేవ్, రఘు వర్మ ఇతర ప్రముఖ రాజకీయ నాయకులు హాజరయ్యారు. సత్యవతి అమ్మ ఆత్మకు శాంతి కలగాలని కోరుతు వారంతా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

బాల్య వివాహాలను అరికట్టడంపై నారాయణ పబ్లిక్

పాఠశాలలో అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలోగల నారాయణ పబ్లిక్ పాఠశాలలో సోమవారం బాల్యవివాహాలను అరికట్టడంపై పాఠశాల కరస్పాండెంట్ మోయిద నారా యణరావు ఆధ్వర్యంలో అవగా హన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వలన అనేకమైన ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా చిన్నారులు చదువుకోడానికి అనేక ఆటంకాలు ఉంటాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1 098 నెంబర్ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-భోగాపురం: గ్రామం నివాసి పిన్నింటి రాజుకి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 81,419 విలువైన చెక్కును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన అత్యవసర వైద్య అవసరాల్లో ఉన్న కుటుంబాలకు తక్షణ సాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరగాలి

సచివాలయాలలో బయో మెట్రిక్ హాజరు తప్పనిసరి : కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: అర్జీదారుల వినతులు న్యాయమైన, స్పీకింగ్ ఆర్డర్ రూపం లో సమాధానం ఇవ్వాలని , అర్జీ దారుల సంతృప్తి పెరగాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు.సోమవారం కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీజిఆర్ఎస్ పై సమీక్షించారు. పీజీఆర్ఎస్ వినతులు పై సమీక్షిస్తూ అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరిగేలా పరిష్కారం ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి రెవెన్యూ వినతుల్లో ఎక్కువ శాతం తిరస్కారం అవుతున్నాయని, ప్రతి వినతును మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగాలని, ప్రస్తుతం నూర్పిన ధాన్యం 30 వేల మెట్రిక్ టన్నుల వరకూ ఉన్నాయని, బుధవారం మొత్తం ధాన్యాన్ని సేకరించాలని తెలిపారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు ఉంటాయని, లక్ష్యాలను సాధించాలని తెలిపారు. 10 పరీక్షల పై దృష్టి పెట్టాలని, 100 రోజుల ప్రణాళిక అమలు చేసి శత శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ మురళి, జిల్లా అధికారులు, వర్చువల్ గా ఆర్.డి ఓ లు, మండల అధికారులు,

మా గ్రామాలను విడదీయవద్దు

కలెక్టర్‌కు విన్నవించిన భీమసింగి, శాసనపల్లి వాసులు

విశాలాంధ్ర-విజయనగరం : ఏళ్ళతరబడి కలిసిమెలిసి ఉంటున్న తమ గ్రామాలను విడదీయవద్దని, రాజకీయ దురుద్దేశంతో కొందరు అధి కార పార్టీ నేతలు చేసిన ప్రతిపాదనలను వెంటనే తిరస్కరిం చాలని జామిమండలం లోని భీమసింగి పంచాయతీ తెలగాపాలెం, శాసనపల్లి గ్రామ పంచాయతీ సోమయాజులపాలెం గ్రామాలకు చెందిన ప్రజలుకోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో తమ ఫిర్యాదును అందజేసారు. అనంతరం ఆయా గ్రామాల వాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నేతలు తమ పంచాయతీలలో ఉన్న గ్రామాలను విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేసారని ఆరోపించారు. ఇది ప్రజలకు కనీసం ఇష్టం లేదన్నారు. కలిసి మెలిసి ఉన్న వారిని విడదీయడం భావ్యం కాదన్నారు. వారి రాజకీయ భవిష్యత్‌కోసం ప్రజలను పావులుగా వాడరాదన్నారు. వెంటనే జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకుని యథావిధిగా గ్రామాలు ఆయా పంచాయతీలలో ఉండేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నేతలు పొందరంకి సంజీవి, మజ్జి హరికృష్ణ, ఎస్. అప్పలరాజు, కంది వెంకటరమణ, జొన్నాడ సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తలకు సన్మాన పత్రాలు

తొలి సంతకంతోనే సంక్షేమానికి శ్రీకారం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లిన ఉత్తమ కార్యకర్తలను విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు చేతుల మీదుగా సన్మానించారు. సోమవారం సాయంత్రం విజయనగరం పట్టణంలోని టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణం, మండలాల్లో డోర్ టు డోర్ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించిన 19 మంది కార్యకర్తలకు సన్మాన పత్రాలు అందించి సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే సంక్షేమ, అభివృద్ధికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల్ డీడ్ల వంటి కీలక నిర్ణయాలకు తొలి సంతకంతోనే ఆమోదం తెలిపి ప్రజల విశ్వాసాన్ని ముఖ్యమంత్రి పొందారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి కీలకమని ప్రశంసించారు. పింఛన్ల పెంపు, స్త్రీ శక్తి పథకం, అన్న క్యాంటీన్లు, రైతు సుఖీభవ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు ప్రజలకు అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే మంచినీటి సౌకర్యార్థం నాగావళి-గడిగడ్డ-చంపావతి నదుల అనుసంధానం అత్యంత అవసరమని, దీనికి జీఓ నంబర్ 44 ద్వారా అవకాశం లభించిందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మాజీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పట్టణ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ కర్రోతు నర్సింగ్ రావు, జొన్నవలస, గాజులు వేగ పిఏసిఎస్ చైర్మన్లు అప్పన్నబాబు, కోరాడ వెంకట్రావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ బొద్దల నర్సింగరావు, గొల్లపేట ఎంపీటీసీ జూర రమణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పైలా మహేష్, 15 డివిజన్ యూనిట్ ఇంచార్జ్ సమ్మెనా సురేష్, పట్టణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి రంగవల్లి పోటీలు, క్రికెట్ టోర్నమెంట్లు

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి.

విశాలాంధ్ర-పూసపాటిరేగ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నెల్లిమర్ల నియోజకవర్గంలో గ్రామ గ్రామాన రంగవల్లి పోటీలు, యువకుల కోసం క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు.సోమవారం ఎమ్మెల్యే గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. 2026 జనవరి 2వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమై జనవరి 13వ తేదీన ముగుస్తాయని చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు.రిజిస్ట్రేషన్ చేసుకున్న జట్ల సంఖ్యను బట్టి షెడ్యూల్ను నిర్ణయిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి పూసపాటిరేగ మండలం కందివలస గ్రామానికి చెందిన ఎస్ఎంఎస్ హెలిప్యాడ్ సమీపంలోని క్రికెట్ గ్రౌండును సిద్ధం చేసినట్టు చెప్పారు. అవసరమైతే మరికొన్ని మైదానాలను కూడా సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.నెల్లిమర్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు, వాలీబాల్ పోటీలు, పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను జనసేన కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం ఉపసర్పంచ్ బాల అప్పలరాజు, మండల నాయకులు కలిసి నిర్వహిస్తారని చెప్పారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.30 వేల రూపాయలు, రెండో బహుమతిగా రూ.20 వేల రూపాయలు అందజేస్తామని తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు నమోదు కోసం సంప్రదించాలి:కె. హరిబాబు-8096638896, టి. లక్ష్మణరావు-7702104489, పి. శివకుమార్-7989788973 ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తోపాటు కొవాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం ఉపసర్పంచ్ బాల అప్పలరాజు, పూసపాటిరేగ మండలం కోఆర్డినేటర్ జమరాజు, ఏఎంసి వైస్ చైర్మన్ బాసిదుర్గ, జనసేన నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి చెందిన 130 కుటుంబాలు తెదేపాలో చేరిక

పార్టీ కార్యకర్తల సంక్షేమం తెదేపాతోనే సాధ్యం:

ఎమ్మెల్యే కొండ్రు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండలం, శ్యాంపురం తెదేపా క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో వంగర మండలం,అరసాడ గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు, సంతకవిటి మండలం,మండరాడ గ్రామం కు చెందిన 80 వైసీపీ కుటుంబాలు తెదేపాలో చేరారు. వీరిని సాదరంగా ఆహ్వానించి తెదేపా పార్టీ కండువాలు ఎమ్మెల్యే వేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. గత వైసీపీ పాలనలో రాజాం నియోజకవర్గం పూర్తిగా కుంటి పడిందన్నారు. నేడు ఈ కూటమి ప్రభుత్వం లో రాజాం నియోజకవర్గంలో ఎన్నడులేని విధంగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు ఆకర్షితులవుతూ ప్రభుత్వ పాలనకు బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలకులు కనీసం రోడ్ల మరమ్మత్తులు చేయించుకోలేని దుస్థితి నియోజక వర్గంలో నెలకొందని ఎద్దేవా చేశారు.నేడు కూటమి ప్రభుత్వంలో రాజాం నియోజకవర్గం లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో విప్లవాత్మక మార్పులు సీఎం చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఉచిత బస్సు వంటి పథకాలు కూటమి ప్రభుత్వం విజయవంతం చేసిందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కడుపులు నింపుతున్నాం. మరే ఇతర రాష్ట్రంలోనూ ఇవ్వనన్ని పెన్షన్లు ఏపీలోనే ఇస్తున్నామన్నారు.ప్రజలకు మేలు చేసేలా చాలా పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. నిత్యం పేదల గురించే సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నారన్నారు.సంతకవిటి మండలం ముకుందా పురం గ్రామానికి చెందిన గెడే సింహాద్రి కి రూ. 39900 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేసారు.వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు లచ్చుభుక్త కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వైసిపి కి చెందిన లచ్చు భుక్త నారాయణరావు, రామినాయుడు,పట్నాన తిరుపతి రావు, తిరుపతి రావు, అగ్గురువు హరిబాబు, కర్రి రామయ్య, అరటికట్ల హరిబాబు, వెంకటరావు,శివ ,జనార్దన రావు,రామారావు, రాగోలు పాపారావు, రామినాయుడు, లంక తిరుపతి రావు, గోపి, వెంకటరావు తదితర కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లో చేరారు. మాజీ తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ కోళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో సంతకవిటి మండలం మండరాడ గ్రామం కు చెందిన వావిలపల్లి రామకృష్ణ?, ప్రసాద రావు ,సూరిబాబు,ఎద్ల అప్పల స్వామి,సింహాచలం, చిన్నారావు, రెడ్డి అప్పలనాయుడు తదితర కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో సుమల వెంకట మన్మథరావు,గట్టి భాను, నంది సూర్య ప్రకాశరావు, గురవాన నారాయణ రావు, దుప్పల పూడి శ్రీను, లచ్చుభుక్త కృష్ణమూర్తి, దూబ ధర్మారావు, ధనుంజయ,కన్నం నాయుడు, మొయ్యి నారాయణ అప్పుడు,మహేష్, వల్లూరి గణేష్, రఘుమండల గణపతి ,జయరాం, శాసపు రమేష్ కుమార్, పి సత్యం నాయుడు, కిరణ్ రమణ, కొండవీటి కోటి , మరిపి జగన్ మోహన్, మజ్జి వెంకట నాయుడు, బి.రవి, బి ఆనంద్, గణపతి, శ్రీను,బి త్రినాథ తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త ! నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

నిబంధనలు పాటిస్తేనే ఆనందం నిలుస్తుంది : సీఐ కె. అశోక్ కుమార్‌లి

విశాలాంధ్ర-రాజాం: జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,చీపురుపల్లి డి.ఎస్.పి టీవీ రాఘవులు ఆదేశాల మేరకు రాజాం సర్కిల్ ఇన్స్పెక్టర్ కి అశోక్ కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో లో సీఐ మాట్లాడుతూ న్యూఇయర్ వేడుకల సందర్భంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి మద్యం సేవించి రోడ్లపై తిరిగితే తప్పనిసరిగా జైలుకు పంపిస్తామని ఆయన హెచ్చరించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని సోమవారం మీడియాకు వివరించారు. రాజాం పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి అర్ధరాత్రి దాటే వరకు రాజాం పట్టణ పరిసర ప్రాంతాలలో 10 ప్రాంతాల్లో విస్తృత పోలీస్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, మద్యం సేవించి పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను నిలుపుదల చేయాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు.రోడ్లపై కేక్ కటింగ్‌లు, పార్టీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని తెలిపారు. పార్టీల నిర్వహణకు ముందస్తుగా అనుమతులు కోరితే మాత్రమే పరిశీలిస్తామని, అయితే డీజేలకు పూర్తిగా నిషేధం ఉంటుందని పేర్కొన్నారు.ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి కొత్త సంవత్సరాన్ని